అంతరిక్షంలో పవర్ గ్రిడ్

న్యూయార్క్, జూలై 26: ఉపగ్రహాలకు విద్యుత్తును సరఫరా చేసేందుకు అంతరిక్షంలో సోలార్ పవర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేసేందుకు ఓ స్టార్టప్ ముందుకొచ్చింది. ఫ్లోరిడాకు చెందిన స్టార్ క్యాచర్ ఇండస్ట్రీస్ అనే సంస్థ.. వచ్చే ఏడాది నాటికి దిగువ భూ కక్ష్యలో పవర్ గ్రిడ్ ఏర్పాటుకు సమాయత్తం అవుతున్నది. దీని కోసం 12.25 మిలియన్ డాలర్ల ఫండ్‌ను సిద్ధం చేయాలని ప్రణాళిక రచించింది. ఇది విజయవంతమైతే అనేక ఉపగ్రహాలు సోలార్ విద్యుత్తుతో నడవనున్నాయి.

ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ చాన్స్‌లర్ ఎన్నికల్లో ఇమ్రాన్ పోటీ

ఇస్లామాబాద్: ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ పదవి కోసం పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ పోటీ చేయబోతున్నారు. ఇమ్రాన్ ఖాన్ జైలు నుంచే ఆన్‌లైన్ బ్యాలట్‌లో పాల్గొనబోతున్నారు. ఈ విషయాన్ని ఇమ్రాన్ సలహాదారు సయ్యద్ జుల్ఫి బుఖారీ కూడా ధ్రువీకరించారు. ఇమ్రాన్ ఖాన్ 1972లో ఆక్స్‌ఫర్డ్‌లోని కెబ్లె కళాశాలలో ఆర్థిక, రాజనీతి శాస్త్రాలను చదివారు. ఆయన 2005–2014 మధ్య కాలంలో బ్రాడ్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్‌గా పని చేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ పదవికి పోటీలో బ్రిటన్ మాజీ ప్రధానులు టోనీ బ్లెయిర్, బోరిస్ జాన్సన్ కూడా ఉన్నారు.

కర్ణాటకలో లిథియం నిక్షేపాలు : కేంద్రం

న్యూఢిల్లీ: కర్ణాటకలోని మండ్య, యాదగిరి జిల్లాల్లో లిథియం నిక్షేపాలను గుర్తించినట్లు కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రకటించారు. రాజ్యసభలో అడిగిన అన్‌స్టార్డ్ ప్రశ్నకు సమాధానం చెప్తూ, అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ (ఏఎండీ) మండ్య జిల్లాలోని మర్లగల్ల ప్రాంతంలో 1,600 టన్నుల లిథియంను ప్రాథమిక సర్వేలో గుర్తించినట్లు తెలిపారు. లిథియం కోసం ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో అన్వేషిస్తున్నట్లు తెలిపారు.

బెంగాల్ విభజనపై రాజకీయ రగడ

మళ్లీ తెరపైకి ప్రత్యేక రాష్ట్రం డిమాండ్

- నార్త్ బెంగాల్‌ను ఈశాన్య ప్రాంతంతో కలపాలని బీజేపీ డిమాండ్
- తృణమూల్ కాంగ్రెస్ ఆగ్రహం



కోల్‌కతా, జూలై 26: పశ్చిమబెంగాల్ విభజన అంశం ఆ రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపింది. ఉత్తరబెంగాల్‌ను ఈశాన్య ప్రాంతంతో కలపాలంటూ ఇటీవల బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్ ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేయడం రాజకీయంగా సంచలనం రేపింది. బీజేపీ విజ్ఞప్తిపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. కేంద్రంలోని బీజేపీ బెంగాల్, బెంగాల్ ప్రజల వ్యతిరేక పార్టీ అని విమర్శించింది. బీజేపీ నేతలు గతంలో కూడా ఉత్తర బెంగాల్‌లోని జిల్లాలను యూటీ, ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ల ద్వారా విభజించడానికి ప్రయత్నం చేశారని ఆరోపిస్తూ, వారి ప్రయత్నాలు సాగనివ్వమని హెచ్చరించింది.

ఎప్పటి నుంచో డిమాండ్

రాష్ట్ర విభజనపై బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి మజుందార్ మాట్లాడుతూ బెంగాల్‌లోని ఉత్తర ప్రాంత జిల్లాలకు, ఈశాన్య రాష్ట్రాలకు ఉన్న పోలికలు గురించి ప్రధాని మోదీని కలిసి వివరించినట్టు చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయా జిల్లాలను ఈశాన్య రాష్ట్రాల్లో కలపాలని కోరానన్నారు. అదే సమయంలో కూచ్ బెహార్‌ను దక్షిణ బెంగాల్ నుంచి విడదీసి ప్రత్యేక రాష్ట్రం చేయాలని బీజేపీ ఎంపీ నాగేంద్ర రాయ్ డిమాండ్ చేశారు. కాగా, బెంగాల్ విభజన గురించి బీజేపీ ఇలా డిమాండ్ చేయడం ఇది తొలిసారి కాదు. ఉత్తర బెంగాల్ ప్రాంతం చాలాకాలంగా రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్నదని, దానిని ప్రత్యేక రాష్ట్రం లేదా యూటీ చేయాలని 2021లో అప్పటి కేంద్ర మంత్రి జాన్ బర్లా డిమాండ్ చేశారు. అదే ఏడాది వేసవి వేడిమి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే విద్యాసంస్థలకు వేసవి సెలవులు ప్రకటించగా, తమకు వాతావరణం చల్లగా ఉందని, సెలవులు అక్కర్లేదని పేర్కొంటూ, అందుకే తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతున్నట్టు సిలిగురి ఎమ్మెల్యే ఘోష్ కోరారు. అలాగే డార్జిలింగ్ హిల్స్‌ను బెంగాల్ నుంచి విడదీయాలని ఒక ఎమ్మెల్యే, జంగల్ మహల్ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రం చేయాలని మరో ఎంపీ డిమాండ్ చేశారు.

బీజేపీ వ్యూహమేమిటి?

గత కొంతకాలంగా బెంగాల్‌లో అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ విఫలయత్నాలు చేస్తున్నది. దానిలో భాగంగానే ఉత్తర బెంగాల్ విభజన డిమాండ్‌తో ఆ ప్రాంత ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ గెల్చుకున్న 12 సీట్లలో ఆరు ఆ ప్రాంతానివి కావడం గమనార్హం. 2019 ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ ఏడు సీట్లను నెగ్గింది. దీంతో బెంగాల్‌లోని మిగిలిన ప్రాంతం కన్నా ఇక్కడ దృష్టి కేంద్రీకరించి ప్రత్యేక రాష్ట్రం డిమాండ్‌ను సజీవంగా ఉంచాలని ఆ పార్టీ భావిస్తున్నది. రాష్ట్ర విభజన తమ లక్ష్యం కాదని, రాష్ట్రం మొత్తం అభివృద్ధినే తాము కోరుంటున్నట్టు ఆ పార్టీ ఎంపీ సమిక్ భట్టాచార్య చెబుతున్నప్పటికీ అంతర్గతంగా ఆ పార్టీ లక్ష్యం వేరే ఉందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో పాగా వేసేందుకు పావులు కదుపుతున్నదని, అందులో భాగంగానే ఈ విభజన అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చిందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఇది దేశాన్ని విభజించడం వంటిదే

పశ్చిమ బెంగాల్‌ను విభజించేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు కుట్ర పన్నుతున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. బెంగాల్‌ను విభజించడం అంటే దేశాన్ని విభజించడం వంటిదేనని అన్నారు. దీనిని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని తేల్చిచెప్పారు. ఢిల్లీలో శనివారం జరుగనున్న నీతి ఆయోగ్ సమావేశానికి హాజరవుతానని ఆమె తెలిపారు. పలు ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులు ఇప్పటికే నీతి ఆయోగ్ భేటీని బహిష్కరించాలని నిర్ణయించగా మమతా బెనర్జీ మాత్రం తాను హాజరై తమ రాష్ట్రం తరఫున నిరసనను తెలియజేస్తానని చెప్పారు.

అమృత్‌సర్‌లో కార్గిల్ యుద్ధ వీరులకు భారత సైనికుల పుష్పాంజలి

అగ్నిపథ్‌పై వాగ్యుద్ధం

- సైన్యం సూచన మేరకే పథకం తెచ్చామన్న ప్రధాని
- పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని ప్రతిపక్ష పార్టీల ధ్వజం

ద్రాస్(లడఖ్), జూలై 26: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం అగ్నిపథ్ స్కీమ్‌పై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం నడిచింది. సైన్యం సూచన మేరకే తమ ప్రభుత్వం అగ్నిపథ్ స్కీమ్‌ను అమలు చేసిందని, ఆర్మీ చేపట్టిన సంస్కరణకు అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ స్కీమే ఒక ఉదాహరణ అని ప్రధాని మోదీ అన్నారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. మోదీ వ్యాఖ్యలపై విపక్షాలు మండిపడ్డాయి. స్కీమ్‌ను సమీక్షించాలని డిమాండ్ చేశాయి. కార్గిల్ విజయ్ దివస్ రోజున అమర జవాన్లకు నివాళులర్పించే సమయంలోనూ ప్రధాని మోదీ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని, అబద్ధాలు ఆడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే విమర్శించారు.

ద్రాస్‌లో అమరులకు ప్రధాని నివాళులు

25వ కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని ప్రధాని మోదీ కార్గిల్‌లోని ద్రాస్‌లో గల యుద్ధవీరుల స్మారకం వద్ద అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలిస్తామని పాక్‌ను హెచ్చరించారు.

మెక్సికన్ డ్రగ్ లార్డ్ జంబాడ అరెస్ట్

న్యూఢిల్లీ: మెక్సికన్ డ్రగ్ లార్డ్ ఇస్మాయిల్ 'ఎల్ మాయో' జంబాడను టెక్సాస్‌లో అరెస్ట్ చేసినట్లు అమెరికా న్యాయ శాఖ ప్రకటించింది. ఆయనతోపాటు ఆయన సహచరుడు జోక్విన్ ఎల్‌చాపో గుజ్‌మ్యాన్ కుమారుడు జోక్విన్ 'లోపెజ్ గుజ్‌మ్యాన్' అరెస్ట్ య్యాడని తెలిపింది. వీరు ప్రపంచంలోనే అత్యంత హింసాత్మక మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సంస్థను నడుపుతున్నారని వెల్లడించింది. వీరు అమ్ముతున్న పెంటానిల్ డ్రగ్ వల్ల అమెరికన్ యువత మృత్యువాత పడుతున్నారని అధికారులు చెప్పారు. వీరిద్దరి అరెస్టుతో మెక్సికోలో హింసాత్మక సంఘటనలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

హారిస్‌కు ఒబామా మద్దతు

వాషింగ్టన్, జూలై 26: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం ఆశిస్తున్న భారత సంతతికి చెందిన కమలా హారిస్‌కు మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా దంపతులు మద్దతు ప్రకటించారు. అమెరికాకు ఆమె అద్భుతమైన అధ్యక్షురాలు అవుతారని ఒబామా ప్రశంసించారు. ఈ మేరకు శుక్రవారం ఒబామా, ఆయన సతీమణి మిషెల్.. హారిస్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఒక వీడియో విడుదల చేశారు. నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించడానికి చేయగలిగినంత సహాయాన్ని చేస్తామని, ఈ పదవికి ఆమె అర్హురాలని తెలిపారు. తొలుత హారిస్‌కు ఒబామా మద్దతు ప్రకటించక పోవడంతో ఆయన ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ప్రచారం జరిగింది. తాజాగా ఒబామా ఆమెకు మద్దతు ప్రకటిస్తూ ఎక్స్‌లో వీడియో షేర్ చేశారు.

ప్రభుత్వ బడుల పేర్లలో జాతి, కులం ప్రస్తావనొద్దు

తమిళనాడు ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

చెన్నై: తమిళనాడులోని ప్రభుత్వ పాఠశాలల పేర్ల నుంచి జాతి లేదా కులం పేర్లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. కల్లకురిచి కల్తీ మద్యం కేసుపై విచారణ సందర్భంగా తనంతట తాను ఈ ఆదేశాలను ఇచ్చింది. కల్వరాయన్ హిల్స్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల పేర్లలో కులం, జాతి పేర్లు ఉంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. 'గవర్నమెంట్ ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్' వంటి పేర్లు ఉంటున్నాయని, వీటిలోని 'ట్రైబల్' పదాన్ని తొలగించాలని ఆదేశించింది. ఇటువంటి పేర్లు ఉండటం వల్ల ఆ పాఠశాలలో చదివే విద్యార్థులు చులకన భావానికి గురవుతారని తెలిపింది. సమీప ప్రాంతాల్లోని ఇతర పాఠశాలల విద్యార్థులతో సమానంగా కాకుండా, తాము గిరిజన పాఠశాలలో చదువుతున్నామని భావిస్తారని వివరించింది.

రౌడీషీటర్ హత్య.. శరీరంపై టాటూతో శత్రువుల పేర్లు

నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

ముంబై, జూలై 26: తాను హత్యకు గురైనా తన శత్రువులు చట్టం నుంచి తప్పించుకోకూడదని భావించిన ఒక రౌడీ షీటర్ తన ఒంటిపై 22 మంది శత్రువుల పేర్లు పచ్చబొట్టుతో రాయించుకున్నాడు. తనూహించిన విధంగానే అతడిని కొందరు బుధవారం హత్య చేశారు. అయితే అతను తన శరీరంపై రాసుకున్న శత్రువుల పేర్ల ఆధారంగా కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. 48 ఏండ్ల గురు వాఘ్‌మరె అనే రౌడీషీటర్‌ను ముంబై వర్లీ సమీపంలోని ఒక స్పాలో బుధవారం కొందరు పొడిచి చంపారు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు హతుడి శరీరంపై పచ్చబొట్టుతో ఉన్న 22 పేర్లను పరిశీలించారు. దీంతో స్పా యజమానే అతడిని హత్య చేసినట్టు నిర్ధారించి అతడితో పాటు, మరికొంత మందిని అరెస్ట్ చేశారు. హతుడు స్పా యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడని, అందుకే అతడిని స్పా యజమాని సుపారీ ఇచ్చి హతమార్చాడని పోలీసులు తెలిపారు.

విపక్ష రాష్ట్రాలపై సవతి తల్లి ప్రేమ

బడ్జెట్‌లో వివక్షపై ప్రతిపక్ష పార్టీల ధ్వజం

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం విపక్ష పాలిత రాష్ట్రాలపై సవతి తల్లి ప్రేమ ప్రదర్శించిందని ప్రతిపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బీజేపీ మిత్రపక్ష పార్టీలు అధికారంలో ఉన్న బీహార్, ఆంధ్రప్రదేశ్‌లకు బడ్జెట్‌లో కేటాయించిన ప్యాకేజీలను చూస్తుంటే ఇది బలవంతపు బడ్జెట్‌గా కనిపిస్తున్నదని, గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా చేయలేదని పేర్కొన్నాయి. కేంద్ర బడ్జెట్‌పై శుక్రవారం లోక్‌సభలో చర్చ కొనసాగింది. ఆప్ ఎంపీ గుర్మీత్ సింగ్ మాట్లాడుతూ 'హమ్ దో హమారే దో' అనే నినాదాన్ని ప్రస్తావించారు. గత రెండు పర్యాయాలు ప్రభుత్వాన్ని నడిపిన ఇద్దరిని(మోదీ, అమిత్‌షాలను ఉద్దేశించి) ప్రస్తుతం ఇద్దరు(నితీశ్ కుమార్, చంద్రబాబు) నిర్దేశిస్తున్నారని అన్నారు.

ఎంఎస్పీ అంశంపై దద్దరిల్లిన రాజ్యసభ

అటు రాజ్యసభలో ఎంఎస్పీకి చట్టబద్ధత అంశంపై విపక్ష పార్టీల సభ్యుల ఆందోళనతో సభ దద్దరిల్లింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడానికి సంబంధించిన ప్రశ్నపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమాధానంపై కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చాలా చేసిందని, ఎంఎస్పీ వ్యవస్థను బలోపేతం చేయడంపై కమిటీ పరిశీలన చేస్తున్నదని పేర్కొన్న మంత్రి.. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధతపై పెద్దగా మాట్లాడలేదు. దీనిపై చౌహాన్ సమాధానం అసంపూర్తిగా ఉన్నదని విపక్ష పార్టీలు ఆందోళనకు దిగాయి. కాగా, కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆనాడు యుద్ధంలో ప్రాణాలు అర్పించిన జవాన్లకు పార్లమెంట్ ఉభయ సభలు నివాళులర్పించాయి.

ఐటీసీ భారీ పెట్టుబడి

న్యూఢిల్లీ, జూలై 26: ఐటీసీ భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. నిర్మాణాత్మక పోటీతత్వాన్ని పెంపొందించడానికి, భవిష్యత్తు అవసరాల నిమిత్తం స్వల్పకాలంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చైర్మన్ సంజీవ్ పూరి తెలిపారు. వాటాదారులతో జరిగిన వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అన్ని వ్యాపారాల్లో నిర్మాణాత్మక పోటీని పెంపొందించడానికి, భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం ఈ పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు.

భెల్‌కు 10 వేల కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ, జూలై 26: ప్రభుత్వరంగ విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భెల్ మరో భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్(డీవీసీ) నుంచి రూ.10 వేల కోట్ల విలువైన థర్మల్ పవర్ ప్రాజెక్టు ఆర్డర్ లభించినట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఝార్ఖండ్‌లో డీవీసీ నిర్మించతలపెట్టిన రెండు 800 మెగావాట్ల థర్మల్ పవర్ స్టేషన్ ఫేజ్–2 ప్రాజెక్టులో భాగంగా బాయిలర్, టర్బైన్, జనరేటర్లు, అనుబంధ అన్ని రకాల విద్యుత్ పరికరాలు సరఫరా చేయాల్సివుంటుందని తెలిపింది. వచ్చే 52 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తికానున్నది.

కేఫిన్ లాభం 68 కోట్లు

హైదరాబాద్, జూలై 26: ఆర్థిక సేవల సంస్థ కేఫిన్ టెక్నాలజీ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.68.07 కోట్ల పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.43.38 కోట్లతో పోలిస్తే 57 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. ఆదాయం 31 శాతం ఎగబాకి రూ.237.56 కోట్లకు చేరుకున్నది.

ఇండిగోకు ఖర్చుల సెగ

న్యూఢిల్లీ, జూలై 26: దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగో లాభాలకు ఖర్చుల సెగ గట్టిగానే తగిలింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 12 శాతం తగ్గి రూ.2,728.8 కోట్లకు పరిమితమైంది. చమురు ధరలు భగ్గుమనడం, ఇతర ఖర్చులు పెరగడం వల్లనే లాభాలు తగ్గడానికి ప్రధాన కారణమని వెల్లడించింది. అయినప్పటికీ కంపెనీ ఆదాయం 18 శాతం ఎగబాకి రూ.20,248.9 కోట్లకు చేరుకున్నది. నిర్వహణ ఖర్చులు 24 శాతం ఎగబాకి రూ.17,444.9 కోట్లకు చేరుకున్నాయి. దీంట్లో ఇంధనం కోసం రూ.6,416 కోట్ల నిధులు వెచ్చించింది.

వాణిజ్య

కొనుగోళ్ల ఉత్సాహం



అమ్మకాల ఒత్తిడి నుంచి తేరుకున్న మదుపరులు

సెన్సెక్స్ 1,293, నిఫ్టీ 429 పాయింట్లు వృద్ధి

ఒక్కరోజే రూ.7.10 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై, జూలై 26: దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు వరుస నష్టాల నుంచి తేరుకున్నాయి. శుక్రవారం భారీ లాభాల్లో ముగిశాయి. మదుపరులు కొనుగోళ్ల ఉత్సాహాన్ని ప్రదర్శించడంతో ఉదయం ఆరంభం నుంచే పరుగులు పెట్టిన సూచీలు.. ఆఖరుదాకా అదే ఊపును కొనసాగించాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,292.92 పాయింట్లు లేదా 1.62 శాతం ఎగిసి 81,332.72 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 1,387.38 పాయింట్లు పుంజుకోవడం విశేషం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ ఆల్‌టైమ్ హైని నెలకొల్పింది. 428.75 పాయింట్లు లేదా 1.76 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 24,834.85 వద్ద స్థిరపడింది. కాగా, అంతకుముందు 5 రోజులపాటు సూచీలు నష్టాలకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలోనే సెన్సెక్స్ 1,303.66 పాయింట్లు, నిఫ్టీ 394.75 పాయింట్లు దిగజారాయి. అయినప్పటికీ తాజా భారీ లాభాలతో ఓవరాల్‌గా ఈ వారం సెన్సెక్స్ 728.07 పాయింట్లు, నిఫ్టీ 303.95 పాయింట్లు పెరిగినట్లైంది.

మెరిసిన బ్లూచిప్ షేర్లు

ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వంటి బడా షేర్లను కొనేందుకు మదుపరులు ఎగబడ్డారు. దీంతో బీఎస్‌ఈ లార్జ్‌క్యాప్ ఇండెక్స్ సెన్సెక్స్‌లో నెస్లే మినహా అన్ని (29) షేర్లు, ఎన్‌ఎస్‌ఈ లార్జ్ క్యాప్ ఇండెక్స్ నిఫ్టీలో మూడు తప్పించి మిగిలిన (47) షేర్లన్నీ లాభాలను అందుకున్నాయి. భారతీ ఎయిర్‌టెల్ షేర్ విలువ అత్యధికంగా 4.50 శాతానికిపైగా పెరిగింది. అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లూ ఇన్వెస్టర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆగస్టు నెల డెరివేటివ్స్ గడువు మొదలు, కేంద్ర బడ్జెట్‌తో ఎదురైన షాకుల నుంచి బయటపడటం, ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో కంపెనీల ఆర్థిక ఫలితాలు బాగుండటం వంటివి కలిసొచ్చాయని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఇక రంగాలవారీగా మెటల్, ఐటీ, ఆటో, కమోడిటీస్, హెల్త్‌కేర్ షేర్లు జోరు మీదున్నాయి. అలాగే బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 2.12 శాతం, స్మాల్‌క్యాప్ 1 శాతం పెరిగాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా దేశాల్లో దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. జపాన్ సూచీ నష్టపోయింది. ఐరోపా మార్కెట్లలో ప్రధానంగా ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ సూచీలు లాభాల్లో కదలాడుతున్నాయి. ఇక గురువారం అమెరికా మార్కెట్లు నష్టాల్లోనే స్థిరపడ్డ సంగతి విదితమే.

మళ్లీ రూ.450 లక్షల కోట్లకు..

వరుస నష్టాలతో పడిపోయిన మదుపరుల సంపద.. తాజా లాభాలతో మళ్లీ పెరిగింది. ఈ క్రమంలోనే రూ.450 లక్షల కోట్ల మార్కును మరోసారి దాటింది. శుక్రవారం ఒక్కరోజే బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.7,10,235.45 కోట్లు పుంజుకున్నది. దీంతో ఇంతకుముందెన్నడూ లేనివిధంగా రూ.4,56,92,671.33 కోట్లకు (5.46 ట్రిలియన్ డాలర్లు) ఆయా కంపెనీల సంపద చేరింది.

6 వేల వరకు తగ్గిన ఐఫోన్లు

న్యూఢిల్లీ, జూలై 26: ఐఫోన్లను కొనుగోలు చేసేవారికి యాపిల్ సంస్థ శుభవార్తను అందించింది. అన్ని రకాల ఐఫోన్ల ధరలను 3–4 శాతం వరకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. సార్వత్రిక బడ్జెట్‌లో ఎక్సైజ్ సుంకాన్ని 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంతో ఈ ప్రయోజనాలను కొనుగోలుదారులకు బదలాయించడంలో భాగంగా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతో అన్ని రకాల ఐఫోన్లు రూ.300 నుంచి రూ.6 వేల వరకు తగ్గనున్నాయి. దీంతోపాటు దేశీయంగా తయారైన ఐఫోన్లు కూడా రూ.300 చౌకవగా...ఐఫోన్ ఎస్‌ఈ మాడల్ ధర రూ.2,300 తగ్గింది. ఐఫోన్ 15 ప్రొ, ఐఫోన్ 15 ప్రొ మ్యాక్స్ రూ.1,29,800కి దిగొచ్చింది. తగ్గించకముందు ఇది రూ.1,34,900గా ఉన్నది. అలాగే ఎంట్రీలెవల్ ఐఫోన్ ప్రొ మ్యాక్స్ 256 జీబీ స్టోరేజీ మాడల్ 10 శాతం తగ్గడంతో రూ.1,59,900 నుంచి రూ.1,54,000కి తగ్గింది.

విడిగా రీచార్జ్ ప్లాన్లు తెండి

వాయిస్ కాల్స్, డాటా, ఎస్‌ఎంఎస్‌లపై టెలికం సంస్థలకు ట్రాయ్ సూచనలు

న్యూఢిల్లీ, జూలై 26: మొబైల్ రీచార్జ్ ప్లాన్ల సమీక్షకు టెలికం రెగ్యులేటర్ ట్రాయ్ శుక్రవారం ఓ కన్సల్టేషన్ పేపర్‌ను విడుదల చేసింది. వాయిస్ కాల్స్, డాటా, ఎస్‌ఎంఎస్‌ల కోసం సపరేట్ రీచార్జ్ వోచర్లు.. ఇలా అన్నింటిపైనా ఈ పేపర్‌ను తీసుకొచ్చింది. ఈ 'టెలికం కన్జ్యూమర్స్ ప్రొటెక్షన్ రెగ్యులేషన్స్ (టీసీపీఆర్) 2012 రివ్యూపై కన్సల్టేషన్ పేపర్'లో స్పెషల్ టారీఫ్ వోచర్లు (ఎస్‌టీవీలు), కాంబో వోచర్ల (సీవీలు) గరిష్ఠ పరిమితిని ప్రస్తుతమున్న 90 రోజుల నుంచి ఇంకా పెంచాల్సిన అవసరం ఉందని కూడా టెలికం సంస్థలకు ట్రాయ్ సూచించింది. అయితే అన్ని టెలికం కంపెనీలు ప్రస్తుతం డాటా, వాయిస్ కాల్స్, ఎస్‌ఎంఎస్‌లతో కూడిన బండిల్ ప్లాన్లను విరివిగా అమలు చేస్తున్న నేపథ్యంలో ట్రాయ్ చేసిన ఈ సూచనలు ఇప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.

కారణం ఇదేనా?

మొబైల్ వినియోగదారుల్లో చాలామంది తమ ప్లాన్‌లో డాటా వృథా అయిపోతున్నదని బాధపడిపోతున్నారు. అందుకే ట్రాయ్ పైవిధంగా టెలికం సంస్థలకు సూచించిందంటున్నారు. కాగా, ఈ కన్సల్టేషన్ పేపర్‌పై వచ్చే నెల 16లోగా అభిప్రాయాలను చెప్పాలని, 23కల్లా అభ్యంతరాలుంటే తెలియపర్చాలని టెలికం సంస్థలకు ట్రాయ్ గడువు పెట్టింది.

పెట్టుబడుల జోరు

పసిడి ధరలు తగ్గడంతో ఇన్వెస్టర్ల ఆసక్తి

న్యూఢిల్లీ, జూలై 26: బంగారంపై పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ఒకప్పుడు పుత్తడి అంటే ఆమడం దూరంలో ఉన్న పెట్టుబడిదారులు ప్రస్తుతం ఇన్వెస్ట్ చేయడానికి ఎగబడుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర సర్కార్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో కస్టమ్ సుంకాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంతో గత నాలుగు రోజుల్లో బంగారం ధర ఏకంగా రూ.5 వేల వరకు తగ్గడమే ఇందుకు కారణం. దీంతో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరుపుతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నిర్ణయంతో బంగారం అక్రమ రవాణా తగ్గే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ధర తగ్గడంతో వల్ల రిటైల్ ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులు పెరిగే అవకాశం ఉన్నదని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ అనలిస్ట్ జతీన్ త్రివేది పేర్కొన్నారు. భౌతిక బంగారంగానే కాకుండా పెట్టుబడి సాధనంగా బంగారాన్ని పరిశీలించే అవకాశాలున్నాయన్నారు. బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి దించారు.

డిమాండ్ మరింత పైకి

ధరలు భారీగా తగ్గడంతో ఆభరణాల కొనుగోళ్లకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. వచ్చేది శ్రావణ మాసం కావడంతో పాటు శుభకార్యాలు కూడా ప్రారంభంకానుండటంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయని పీసీ జ్యువెల్లర్ ఎండీ బలరాం గార్గ్ తెలిపారు. దీంతో కిలో బంగారం ధర రూ.9.82 లక్షల నుంచి రూ.3.93 లక్షలకు దిగొచ్చింది.

పారిశ్రామిక రంగానికి మొండిచెయ్యి!

రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అత్తెసరు

3,500 కోట్ల ఎంఎస్‌ఎంఈ సబ్సిడీ బకాయిలకు 2,762 కోట్లతో సరి

ఆందోళన వ్యక్తం చేసిన ఇండస్ట్రీ వర్గాలు



హైదరాబాద్, జూలై 26(నమస్తే తెలంగాణ): పారిశ్రామిక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం మొండిచెయ్యి చూపించింది. వరాల జల్లు కురిపిస్తారని ఎంతో ఆశతో ఎదురుచూసిన పరిశ్రమల వర్గాలకు చుక్కెదురైంది. ఇప్పటికే సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) ఏర్పాటు చేసుకున్నవారికి సబ్సిడీల రూపంలో చెల్లించాల్సిన రూ.3,500 కోట్లు చెల్లించకపోగా..ఈసారి బడ్జెట్‌లో రూ.2,762 కోట్లు కేటాయింపులు జరిపింది. అన్ని రంగాల వారిని ఆదుకుంటామని ప్రతిజ్ఞ చేసిన రేవంత్ సర్కార్ కేవలం కంటితుడుపు చర్యలకు మొగ్గుచూపింది. కోట్ల మంది ఉపాధి పొందుతున్న చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలపై రాష్ట్ర సర్కార్ శీతకన్ను వేసింది. దీంట్లో గత కొంతకాలంగా చిన్న సంస్థలకు సబ్సిడీలు కూడా చెల్లించడం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా భారీగా నిధులు కేటాయిస్తారని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. టీ–ప్రైడ్, టీ–ఐడియా, స్టాండప్ ఇండియా తదితర పథకాల కింద లబ్దిదారులకు ఇవ్వాల్సిన సబ్సిడీలు రూ.3,500 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బకాయిలు చెల్లించాలని లబ్దిదారులు గత కొంతకాలంగా పరిశ్రమల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ సర్కార్ కరుణించడం లేదు. దీనిపై ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ..ప్రభుత్వం నిధులు విడుదల చేసినవెంటనే చెల్లిస్తామని చెబుతున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా పాత బకాయిల కోసం నిధులు కేటాయించకపోవడంతో ఇండస్ట్రీ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమలకు, కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్, స్టేట్ సెక్టార్ స్కీమ్స్, ప్రోత్సాహకాలకు కలుపుకొని మొత్తంగా రూ.2,762 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమలు, స్టేట్ సెక్టార్ స్కీంలకు కేటాయించిన నిధులను పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు రాయితీల రూపంలో ఖర్చు చేయనున్నారు.

ఎంఎస్‌ఎంఈ పాలసీకి మోక్షం ఎప్పుడు?

ఎంఎస్‌ఎంఈ పాలసీకి ఇప్పట్లో మోక్షం లభించే అవకాశాలు కనిపించడం లేదు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు నూతన పాలసీ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్లు ప్రకటించినప్పటికీ ఇప్పటికి కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికే ఉన్నతాధికారులు ఈ కొత్త పాలసీని సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినప్పటికీ, బడ్జెట్‌లో దీనికి చోటు లేకుండా పోయింది. కొత్త విధానం వచ్చే వరకు ప్రస్తుత విధానమే కొనసాగుతుందని అధికారవర్గాలు స్పష్టంచేశాయి.